# బ్రహ్మర్షి

## కప్పగంతుల మల్లికార్జునరావు

నడుస్తూ నడుస్తూ చైనులు ఠక్కున ఆగిపోయాడు. యింటి నుంచి బయలుదేరేటప్పుడు భార్యాపిల్లలు అన్నంత పనీ జరిగింది.

"నాన్నగారూ. నాకు తెల్సు — ఆ చెప్పులు మీరు కాలేజీకి చేరేలోగా తెగిపోతాయి. అసలే డొక్కు చెప్పులు. మధ్యలో చెప్పుతెగిదంటే నానాయాతన పడ్తారు. నా చెప్పులు వేసుకెళ్ళండి నాన్నగారూ..." కొడుకు సలహా యిచ్చాడు.

"ఏంటి నాన్నగారూ మీకు మరీ యింత చాదస్తం? మా స్టూడెంట్స్ అంతా మిమ్మల్నేమని పిలుస్తారో తెల్సా? పిసినారి అంటారు. క్రీస్తు పూర్వం మనిషి అంటారు. మాకు వొక్కొక్కరికి రెండు మూడు జతలున్నాయి. మరి మీకెందుకు నాన్నా ఈ కర్మ? ఏమైనా మీరు ఇవాళ కొత్తచెప్పులు కొనుక్కొని యింటికి రావల్సిందే. లేకపోతే మాకు 'షేమ్'గా వుంది. తెల్సా?" కూతురు వార్నింగ్ యిచ్చింది.

"ఏమండీ. ఈ చెప్పులు మిమ్మల్ని మధ్యలో యిబ్బంది పెట్టేస్తాయేమోనని నాకూ భయంగా వుందండీ. మీరు ఆర్డరిచ్చిన చెప్పులు ఎప్పుడొస్తాయో ఏమో? పోనీ ఈ లోగా మరో జత..." భార్య సున్నితంగా చెప్పింది. ఎంతైనా అర్థాంగి కనుక!

చైనులు వొంగి ఎడం కాలి చెప్పును చూచుకొన్నాడు.

అసలే పాత చెప్పులు. ఎన్ని కుట్లు పడ్డాయో! యిక నడవటం సాధ్యమా? అయినా ఆశ... అప్పలస్వామి యివాళైనా...

"రిక్షా బాబయ్యా..." చెప్పుల్తో ఆయన పడ్తున్న అవస్థ చూసి రిక్షావాడు అడిగేడు. ఆయన రిక్షా ఎక్కడని రిక్షావాళ్ళందరికీ తెల్సు.

"వద్దు..." అన్నట్లు తలవూపి చైనులు మెల్లగా నడవ సాగేడు.

ఎడంకాలు ఈడుస్తూ... కుడికాలు ఎత్తిఎత్తి వేస్తూ... అప్పటి తన నడక అతనికే నవ్వు తెప్పించేలా వుంది. తనని చూసి బజార్లో జనం నవ్వుకొంటుంటారని అతనికి తెల్సు.

చేసేది కాలేజీ లెక్చరర్ ఉద్యోగం. దేశమంతా తిరిగి వుపన్యాసాలిచ్చేది చాలా పెద్ద పెద్ద విషయాలను గురించి. కానీ వేసుకొనేది పాతజోళ్ళు!

ఒక్క కాలి జోళ్ళనే ఏమిటి? చైనులు వేషమే త్రేతాయుగాన్ని గుర్తు తెచ్చేలాగుంటుంది. ముతక ఖద్దరు పంచె... ఖద్దరు లాల్చీ... అలాంటిదే వో పెద్ద ఉత్తరీయాన్ని భుజం చుట్టూ నిండుగా కప్పుకొంటాడు. మెడలో రుద్రాక్షమాల... ముఖాన ఎప్పుడూ చెరగని ఎర్రని కుంకుమ బొట్టు.. చేతిలో పాతకాలం నాటి హేండ్‌బేగ్...

వేషమే కాదు — ఆయన భావాలు కూడా పాతవని, ముతకవని అనుకొంటుంటారు కొందరు. భారతీయ సంస్కృతి, జాతీయతా భావన... వాల్మీకి వ్యాసాది మహాఋషులు... రామాయణ భారత భాగవత పురాణాలు... వేదఋషుల వైజ్ఞానిక దృష్టి... ఈ విషయాలపై ఆయన వుపన్యాసాలు విననివారుండరు.

వేషభాషల్లో ఆయన అలా కొందరికి ఛాందసుడుగా కన్పించినా అందరికీ ఆయనంటే గౌరవం. ఆయనని చూస్తే ఎంతటి దుర్మార్గులకీ చెయ్యెత్తి నమస్కరించబుద్ధి వేస్తుంది. మృదుభాషి, సాధువచనుడు, కార్యశీలి; పరసేవాపరాయణుడు.

అలాగే తంటాలుపడి నడుస్తూ ఓ సెంటర్ దగ్గరికొచ్చాడు. అక్కడ ఆగి వో చెట్టు క్రింద ప్రదేశం మీదికి దృష్టి సారించాడు.

'అప్పలస్వామి యివాళా రాలేదు. కారణం ఏమిటో పాపం' అనుకొంటూ మెల్లగా నిట్టూర్చాడు.

మరో పది అడుగులు వేయగానే అతని దృష్టిని వో చెప్పులు కుట్టే వ్యక్తి ఆకర్షించాడు. అతనెవరో కొత్తవాడులావున్నాడు. అతని వద్దకి నడిచాడు.

"బాబూ ఈ చెప్పులు కాస్త కుట్టిపెడ్తావా?"

చెప్పులు కుట్టే వ్యక్తి ఆయన విడిచిన చెప్పుల్ని చేతిలోకి తీసుకొన్నాడు. అటూ ఇటూ తిప్పి, లాగి, పరీక్షించాడు. ఆ తర్వాత తల ఎత్తి చైనులును చూచాడు.

"బాబూ. అదురుట్టమంటూ వుంటే జనమంతా సేరి నన్ను ఈ దేశానికి పెదాన మంతిరిని సేయొచ్చు. కానీ ఈ సెప్పుల్ని మాత్తరం రష్యావోడు అమెరికావోడు కూడా రిపేరింగ్ సెయ్యలేడని ఛాలెంజ్ సేసి సెప్పగలను. అటు సూడండి బాబూ. అడుగడుక్కూ సెప్పుల సాపులే. కొత్తయి కొనుక్కోండి బాబూ. ఆడ కొనుక్కొనే శకితినేకపోతే సెప్పండి. సీప్‌గా నేను సేసి పెడ్తాను" పాత చెప్పుల్ని చైనులు కాళ్ళ వద్ద విసిరిపడేస్తూ అన్నాడతను.

చెప్పుల్ని తొడుక్కొని మరో పదడుగులు వేసేడు చైనులు.

కుడికాలి జోడు కూడా తెగింది.

భార్యాపిల్లల మాటలు, చెప్పులు కుట్టేవాడి వుపన్యాసం గుర్తుకొచ్చాయి అతనికి.

చెప్పుల్లో నుంచి కాళ్ళను తీసి, కుడికాలుతో ఫుట్‌బాల్‌ను కిక్ యిచ్చినట్లు చెప్పుల్ని రోడ్డు పక్క చెత్తకుప్పలోకి విసిరికొట్టాలని అనిపించిదాక్షణం.

క్రిందికి వంగి కుడికాలి చెప్పును చూచాడు. అడ్డదిడ్డంగా తెగిందది.

దేహం అశాశ్వతం. మమకార బంధాలు అశాశ్వతం. భౌతిక సుఖాలు అశాశ్వతం. అలాగని జీవితంలో శాశ్వత విలువలే లేవనుకోవటం ఎంత పొరపాటు? జీవితం నిరర్థకం అనుకోటం ఎంత అజ్ఞానం...?

అలాగే చెప్పుకు వేసిన కుట్లు అశాశ్వతం కావచ్చు. చెప్పు తయారీకి వాడిన చర్మం అశాశ్వతం కావచ్చు. కానీ ఆ చెప్పులు... అవి తయారు చేసిన వ్యక్తి... ఆ వ్యక్తి యొక్క విలువలు...

చైనులు రెండు చెప్పుల్ని చేతిలోకి తీసుకొన్నాడు.

"మాస్టారూ. తెగిన పాతచెప్పుల్ని చేత్తో పట్టుకున్నారేమిటి? కాలి దగ్గర వుండాల్సిన వస్తువుల్ని చేతుల్లోకి తీసుకోకూడదు సార్. వర్షం వచ్చేలా వుంది. త్వరగా ఆ చెప్పుల షాపులోకి దూరండి" ఎవరో తెల్సిన వ్యక్తి అయాచితంగా సలహా యిచ్చివెళ్ళాడు.

కాళ్ళ క్రింద భూమి వేడిగా కాలుతోంది. కానీ ఆకాశంలో మేఘాలు ఎప్పుడు ముసిరేయో! చల్లటి గాలి — వర్షం వచ్చే సూచన—

చైనులు చేతిసంచీ తెర్చి చెప్పుల్ని అందులో భద్రంగా దాచేడు. చకచకా నడవసాగేడు — పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ.

వర్షం ఆరంభమయిందింతలో—

ఆ వర్షపు ధారల్లో అప్పలస్వామి ఆయన కళ్ళముందు మెదలసాగేడు.

* * *

ఎప్పుడో చాలా ఏళ్ళ క్రితం— చైనులు వుద్యోగంలో చేరిన కొత్తల్లో..

అప్పటికతనికి చెప్పులు వేసుకునే అలవాటు లేదు.

అందుకు కారణం అతని బీదరికం కాదు. ఎందుకంటే అప్పటికింకా పాదరక్షలధరలు యిప్పటిలా ఆకాశానికంటి లేవు. మూడు నెలలకు ఆరు నెలలకు వో

**ఎందరో ప్రిన్సిపాల్‌తో సహా — ఎన్నో విధాల చెప్పిచూశారు. లాభం లేకపోయింది. కానీ వోరోజు యిద్దరు మిత్రులు వోనాడు చెప్పులు కుట్టే వ్యక్తి గురించి మాట్లాడుకుంటుంటే అతనికి ఆవ్యక్తిపై శ్రద్ధ కలిగింది.**

చెప్పుల జత మార్చాల్సిన అవసరమూ వుండేదికాదు.

అయితే అప్పటికే చైనులు వో ధర్మానికి, సేవా జీవితానికి అలవాటు పడ్డాడు. అ మార్గంలోనే అతను శిక్షణ పొందాడు.

స్వార్థం త్యాగభావానికి అడ్డు. స్వీయ సుఖవాంఛ సంఘ సేవకు ప్రతిబంధన.

పెద్దపెద్ద కార్యాలను నిర్వర్తించటానికి చిన్న చిన్న సుఖాలకు అలవాటుపడటం అవరోధం కావచ్చు. చిన్నప్పటి నుంచి దేహాన్ని శ్రమ పడటానికి అలవాటు చేస్తే కష్టాలను దేహం సులభంగా ఎదుర్కోనగలదు కదా?

వేడికి, తేమకు, పలుకురాళ్ళకు భయపడే పాదం అవసరమయితే అడవుల్లో కొండల్లో ఎలా తిరగగలదు? దళసరి పాదమై అంత సుఖానికి అలవాటు పడ్తే శరీరంలో సున్నిత అవయవాలు మనిషి యొక్క ఆదర్శాలకు లొంగుతాయా? తిరుగుబాటు చేయవూ?

ఆ అభ్యాసంలో చెప్పులు లేకుండా తిరగటంలో భాగం.

చిన్నప్పటి నుంచి యోగాభ్యాసాలు చేసిన శరీరం కూడా కావటంతో శరీరం అతనికి లొంగిపోయింది. ఎంత దూరమయినా చెప్పులు లేకుండా నడవటం అలవాటయింది.


అయితే చెప్పులు లేకుండా తిరగటం అనాగరికత లక్షణంగా అప్పటికే పరిగణించబడ్తోంది. వో కాలేజీ లెక్చరర్... చెప్పులు లేకుండా కాలేజీకి వెళ్ళటమా? బుర్ర లేకుండా వెళ్లినా సహిస్తుంది కాని చెప్పులు లేకుండా వెళ్తే సహిస్తుందా నాగరిక లోకం?

ఎందరో — ప్రిన్సిపాల్‌తో సహా ఎన్నో విధాల చెప్పి చూచారు. లాభం లేకపోయింది. కానీ ఓరోజు యిద్దరు మిత్రులు ఓ నాటు చెప్పులు కుట్టే వ్యక్తిని గురించి మాట్లాడుకొంటుంటే అతనికి ఆ చెప్పులు కుట్టే వ్యక్తిపై శ్రద్ధ కలిగింది. చెప్పుల పైకి దృష్టి మళ్ళింది.

అప్పలస్వామి వద్దకు మొదటిసారి అలా వెళ్లాడు.

అప్పలస్వామి, అతను కాలేజీకి వెళ్ళే దోవలో, వో సెంటర్లో మురిక్కాలువ పక్కన పాత చెప్పుల్ని రిపేరు చేస్తుంటాడు.

అతను దృఢంగా, నల్లగా వుంటాడు. చెవులకి బంగారు కమ్మలు, ముంజేతిన వో పెద్ద వెండి మురుగు, మొహాన రూపాయి కాసంత ఎర్రని కుంకుమబొట్టు...




"ఏమిటి బాబూ? మీరిలా నా వద్దకొచ్చారు?"

అతని వాక్కు స్వచ్ఛంగా వుంది. అతనికి తను తెల్సా?

"చెప్పులు కుట్టే వృత్తిలో వున్నవాడిని బాబూ. ఈ దారిన నడిచే అందరూ నాకు తెల్సు., అందరి పాదాల అడులు నాకు కంఠోపాఠమే. ఎవరి పాదాలకు ఎలాంటి పాదరక్షలుంటే బాగుంటుందో ఆలోచించి అలా చెప్పులు కుట్టియివ్వగలిగిన వాడే నిజమైన 'చర్మ కళాకారుడు' అని మా నాన్న చెప్తుండేవాడు. అయినా యిప్పుడు కళ ఎవరికి కావాలండీ. పైపై మెరుగులు... షోకులు... యంత్రాలు చెప్పుల్ని కుడ్తున్నాయి. మనుషులు యంత్రాలులా మారిపోతున్నారు."

అప్పలస్వామి మాటలు చైనులుకు నచ్చాయి. కానీ మాటల్ని బట్టే మనుషుల్ని అంచనా వేయటం మంచిదికాదు కదా?

"మీరు. చెప్పులు ఎందుకు వేసుకోరో నాకు తెలియదు బాబూ. కానీ మీరు ఇటు గుండా

నడిచిపోతున్నప్పుడు చాలా సార్లు, వో విషయం అనుకొన్నాను''

"ఏమిటది?"

"దృఢకాయులయివుండి మీలాగా వేగంగా నడిచే వారి పాదాలకు అందాన్నిచ్చేలా చెప్పులు కుట్టటం... ఆ చెప్పులు కొంతకాలం పాటు మన్నేలా కుట్టగలగటం చర్మకళాకారుడికి పరీక్ష అని. అలాంటి పరీక్ష నాకు వస్తే బాగుండనని అనుకొనేవాడిని''

"అలాగా? అయితే యిప్పుడు అలాంటి పరీక్ష వచ్చిందనుకో. ఏం చేస్తావ్?''

"ఏం చేస్తాను? నా కళాకౌశలం ఏమిటో చూపిస్తాను. కానీ బాబూ మీరు నిజంగా నా చేత చెప్పులు కుట్టించుకొందామని వచ్చారా? ఎప్పుడూ చెప్పులు తొడుక్కోని మీకు యిలాంటి బుద్ధి పుట్టటం నా అదృష్టం బాబూ...''

"ఆ బుద్ధి పుట్టటానికి కారణం నువ్వే. నీ కోసమే యిక మీదట చెప్పులు వేసుకొంటాను. తన వృత్తిని కళగా, కళను దైవంగా ఆరాధించే వోవ్యక్తి కుట్టిన చెప్పులు వొక్క పాదాలకే కాదు మొత్తం శరీరానికే కళనిస్తాయి. అలాంటి చెప్పులు ఆ వ్యక్తి పాదాలకు మాత్రమే రక్షకాదు— సమాజ జీవనంలో సామరస్యానికే రక్ష''

అప్పలస్వామి చైనులు కాళ్ళను నొక్కి పరీక్షించాడు.దం పుల్ని శ్రద్ధగా పరిశీలించాడు. అతని ఎత్తు, పొడుగూ, లావుల్ని అడిగి తెల్సుకొన్నాడు.

"ఈ వివరాలన్నీ ఎందుకు?''

"శరీరానికి సంబంధించిన ఈ వివరాలే కాదు సార్. చెప్పులు తొడుక్కోబోయే వ్యక్తి యొక్క అభిరుచులు, మనస్థితి, జీవనదృక్పథం తెల్సుకోటం కూడా అవసరం సార్. నోటితో తినే ఆహారం కడుపులో కి మాత్రమే పోయినా శరీరానికి కంతటికీ శక్తినిస్తుంది కదా? అలాగే కుట్టేది పాదాలకు చెప్పులే అయినా ఆ చెప్పులు ఆ వ్యక్తి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని అనుసరించి వుండాలి. అప్పుడే చెప్పుల వల్ల ఆ వ్యక్తికి శోభ కలుగుతుంది. మీ వుపన్యాసాలు విన్నాను నేను. కనుక మీ తాత్విక దృష్టి, మనస్తత్వం యివన్నీ నాకు బాగా తెల్సు''

ఆశ్చర్యపోవటం చైనులు వంతయింది.

"బాబూ. నాకు మీరంటే గౌరవం వుంది. కానీ వృత్తి వద్ద నేను మొహమాటాలకు పోను. అందుచేత చెప్పుల యొక్క ధర ఎంత అవుతుందో ముందే చెప్పటం మంచిదని భావిస్తున్నాను'' అంటూ అప్పలస్వామి తాను కుట్టబోయే చెప్పుల ధరను చెప్పి అందుకుగాను అడ్వాన్సుగా యివ్వాల్సిన సొమ్మును అడిగేడు.

అప్పలస్వామి కుట్టే చెప్పుల ధర బజార్లో చెప్పుల ధరకన్నా హెచ్చుగా వుంటుందని మిత్రులు అనుకోటం విన్నాడు చైనులు. అయినా నాణ్యత వుంటుంది. అతడిని పరీక్ష చేయాలనిపించింది.

"అదేమిటి అప్పలస్వామీ? బజార్లో ధరకన్నా చాలా ఎక్కువ చెప్పేవే. యిలా అవుతే నీ దగ్గర చెప్పులెవరు కొంటారు? నా మిత్రులకు కుట్టిన రేటుకన్నా ఎక్కువ చెప్పేవే నాకు? యిది నీకు న్యాయమా?''

"మీరే అలా అడిగితే ఏం చెప్పను బాబూ? కానీ సత్యం చెప్తాను. నేను అడిగిన ధర న్యాయమే. మీ మిత్రుల వద్ద తక్కువ తీసుకొన్నమాట కూడా వాస్తవమే. మీ చెప్పులకి ఎక్కువ ధర చెప్పిందీ నిజమే. అందుకు కారణం వుంది. చెప్పుల్ని బట్టే కదా ధర? అయితే నావద్ద ధరల ప్రకారం చెప్పులుండవు. చెప్పుల నాణ్యతలోనూ మార్పువుండదు. అయితే వొక్కొక్క వ్యక్తిని బట్టి వొక్కొక్క చెప్పుల జత తయారుచేయవల్సి వుంటుందని చెప్పేను గదా? మీవి నడకకు అలవాటు పడ్డ పాదాలు. మీ పాదాలకు పాదరక్షలు చేయటం శ్రమతో కూడిన పని. మీరెంత తిరిగినా అవి అందరికీ మన్నినట్లే మన్నేలా తయారుచేయాలి. యిక బజారు ధరలు అంటారా, ముందే చెప్పేనుగా బాబూ? అది వ్యాపారం. నాది కళ. కళాకారుడు రోడ్డు పక్కన, వ్యాపారుడు పంకాల క్రింద కుర్చీల్లో ఉండటం దౌర్భాగ్యపు సహజమే కదా! చెప్పులు కొనాలని నేను రేట్లు పెట్టను బాబూ. చెప్పుల్ని బట్టే ధరను చెప్తాను. మీకు నాపై విశ్వాసం వుంటేనే ఆర్డర్ యివ్వండి. మొహమాటమేమీ లేదు''

అప్పలస్వామికి తన వృత్తి పట్ల గౌరవానికి, తనపై తనకుగల ఆత్మవిశ్వాసానికి చైనులు ఆశ్చర్యపోయాడు.

ఆ మనిషిలోని కళాకారుడికి గల గర్వం ఆ వ్యక్తిని ఎంత వున్నతుడిని చేసింది!



## సైంటిస్ట్

మతిమరుపు అధికంగాగల ఓ ప్రముఖ సైంటిస్ట్‌ని కలవాలని ఆయన యింటికి బయలుదేరారు హరి, గిరి. ఆ సైంటిస్ట్ యిల్లు గుర్తుపట్టలేక పోయారు. దారిన పోతున్న ఓ వ్యక్తికి అడ్రసు చూపించి అడిగారు.

"ఓ మీరు నన్ను కలవడానికి వచ్చారా! ఇందాకట్నించి నేను కూడా మా యింటికోసం వెతుకుతున్నాను. రండి ముగ్గురం. వెళ్లి ఆ వస్తున్నతన్ని అడుగుదాం'' అన్నాడా వ్యక్తి.

—డి. శరత్ చంద్ర (వైజాగ్)

"అప్పలస్వామీ! ప్రపంచంలో ఎవరికో గాని లభించని ఐశ్వర్యం నీకు లభించిందయ్యా. నీ జీవితం ధన్యం. నువ్వు చరితార్థుడివి. నీ యిష్టప్రకారమే కానియ్. యిదిగో అడ్వాన్సు''

అప్పలస్వామి అడ్వాన్సు తీసుకొని చెప్పులు ఎప్పటికి తయారయ్యేది చెప్పేడు.

"యోగః కర్మ సుకౌశలం'' అతని వద్ద నుంచి వస్తుంటే గీతాశ్లోక పాదం గుర్తుకొచ్చింది చైనులుకి.

* * *

తను కుట్టిన చెప్పుల యొక్క ఆయుర్దాయం, రిపేర్‌కు గడువు, ఫ్రీ సర్వీస్ గ్యారంటీ యిత్యాది అన్నీ యిస్తాడు — నోటితో. అతను సంవత్సరం అంటే ఏణ్ణార్థం దిట్టంగా జీవిస్తాయి ఈ చెప్పులు. అతని మాట పొరపాటున కూడా పొల్లుపోయిన దాఖలాలు లేవు.

"ఏం అప్పలస్వామీ. రిపేరింగ్ రేట్లు కూడా పెంచేసేవే?''


అప్పలస్వామి వద్ద చెప్పులే కాదు. రిపేరింగ్‌కూడా ఖరీదు. అతను కుట్టిన చెప్పులు అతనే రిపేరు చెయ్యాలి. మరొకరు చేస్తే కొండమంగలి క్షవరంలా వుంటుంది.

"ఏం చెయ్యనుబాబూ? పశువుల్ని చంపొద్దని మీ వాళ్ళేకదా అంటున్నారు. చర్మం ధర పెరిగింది. ఎంత ఆర్జించినా మా మొరార్జీగారు ఏమన్నా మిగిలిస్తేనా?''

"మొరార్జీ ఎవరు? కొంపదీసి.. అప్పటికి ఆర్థికమంత్రి మొరార్జీ మీద సెటైర్ కాదుకదా?''

అప్పుడు చెప్పేడు తన కుటుంబ విషయం.

అతనికి వొక కొడుకు. యిద్దరు కూతుళ్ళు. కొడుకును తన వృత్తి నేర్పుదామనుకొన్నాడు. కానీ యింగ్లీషు చదువులని కాలేజీలకు వెళ్ళాడతను. ఎంత





డాక్టరు

“డాక్టరుదగ్గరికి వెళ్ళొచ్చాను” చెప్పింది వర్ధని.

“ఏమన్నారు!” అడిగాడు సారధి.

‘ఒకనెలరోజులుపాటు పనేం చెయ్యకూడదన్నారు. ఎక్కడికయినా విహారయాత్ర చేసి రమ్మన్నారు. నన్ను తీసుకెళ్ళండి” అంది వర్ధని.

“తీసుకు వెళ్తాను.”

“ఆ ఎక్కడికి!”

“ఇంకో డాక్టరు దగ్గరకి” కోపంగా చెప్పాడు సారధి.

—ఎల్. రఘుబాబు (హైదరాబాద్)

డబ్బా చాలదతనికి ఆ పేరు చెప్పి ఈ పేరు చెప్పే మొరార్జీ పన్నులు వసూలు చేసినట్లు వసూలు చేస్తాడు తండ్రివద్ద.

“బాబూ. వాడికి చదువురాదు బాబూ. ఈ కళా నేర్చుకోలేదు. ఎలా బ్రతుకుతాడో ఏమో...? నేనంటే పల్లెటూరిలో కొన్ని పద్ధతులకు అలవాటుపడి పెరిగినవాడిని కనుక యిలా వున్నాను కానీ... మా వృత్తి నేర్చుకొని లక్షలు సంపాదిస్తున్న పెద్ద కులాలవారు ఎందరులేరు బాబూ? నేను చెప్పే చదువే, నేర్పేపనినే తెల్లబట్టలు వేసుకొని కాలేజీలో నేర్చుకొంటే గొప్పయిందీ? అదే నా దగ్గర కులవృత్తిగా నేర్చుకుంటే నామర్ద అవుతుందా? ఏంటో బాబూ.. వాడికి బుర్రలేదు. మా కులవృత్తికి యిప్పుడున్న డిమాండ్ బ్రాహ్మణులైన మీ కులవృత్తికి వుందా? లేదు కనుకనే మీరంతా మా కులవృత్తి పనులని నేర్చుకుంటున్నారు. యిలా ఎంత చెప్పినా వినడండీ మా మొరార్జీ. కామర్సేంటో చదివి బ్యాంక్‌లో ఆఫీసర్ అవుతాట్ట!”

ఏమీ చదువుకోని అప్పలస్వామి ప్రాచీన వృత్తి ధర్మాల విశిష్టతను ప్రస్తుత విద్యావిధానంతో ఎంత చక్కగా పోల్చి చెప్తున్నాడు?

మరోసారి అప్పలస్వామి నన్నో కోరిక కోరాడు.

“బాబూ. మిమ్మల్నొకటి అడగాలనుకొంటున్నాను. మీరు తెలుగు, సంస్కృతం చదువుకొన్నారు. మీరెంతటి పండితులో నాకు తెల్సు. నాకొడుకంటే పనికి మాలినవాడవుతున్నాడు కానీ కూతురు తెలివిగలదయ్యా. సంస్కారవంతురాలు. ఆ పిల్లకు కాసిని పూజామంత్రాలు, సంస్కృతం నేర్పగలరా బాబూ...?”

పూజామంత్రాలు... సంస్కృతం...?

“అలాగే నేర్పుతాను. కానీ ఈ రోజుల్లో బ్రతకటానికి అవెందుకు అప్పలస్వామీ? అందులో ఆడపిల్లకు...”

“నన్ను పరీక్ష చేయటానికి అంటున్నారు కదా బాబూ ఆ మాటలు? అవి నేర్చుకొంటే వాక్‌శుద్ధి కలుగుతుంది కదా? దేహశుద్ధి, వాక్‌శుద్ధి, మనోశుద్ధి, ఆత్మశుద్ధి లేవనే కదా మేం పూర్వకాలంలో అంటరానివారమయ్యాము? నా కూతురికి యివన్నీ వున్నాయి బాబూ పూజాపునస్కారాలు నేర్చుకొన్న మనిషికి

ఆత్మవిశ్వాసం గుండె నిబ్బరం పెరుగుతుంది. మనశ్శాంతి వుంటుంది. నేనీ మాత్రం యిలా వుంటగలుగుతున్నానంటే చిన్నతనంలో మా వూళ్ళో వో శాస్త్రిగారు నేర్పిన నాలుగు సంస్కృతం ముక్కల మహిమే బాబూ? మీరు నేర్పుతామంటే అమ్మాయిని మీ యింటికి పంపుతాను”

“నేర్పుతాను అప్పలస్వామీ. తప్పక నేర్పుతాను. మీ యింటికి వచ్చి మరీ నేర్పుతాను”

చైనులు అప్పలస్వామి యింటికెళ్ళాడు వోరోజు. అతనిదసలు పల్లెటూరు. పట్నంలో అవుతే తన వృత్తి ద్వారా హెచ్చుగా సంపాదించుకోవచ్చని, పిల్లవాడి పోరుపడలేక చదువుకోసమని అతను పట్నానికొచ్చాడు. మురికివాడలో వో చిన్న అద్దెపాకలో కాపురం వుంటు న్నాడు.

మురికివాడలో తిరగటం చైనులుకు అలవాటే. వాటిని అసహ్యించుకోడు. కానీ ఆ మురికివాడల్లో ఆ అద్దె యింట్లోకి అడుగు పెట్టిన తర్వాత కలిగిన అనుభూతి వర్ణనాతీతం.—

యిల్లు చిన్నదయినా కడిగిన ముత్యంలా వుంది. వొకవైపు చిన్న పూజామందిరం—

శరీరానికి, మనసుకు జబ్బులు రావచ్చు. అసహ్యంగా తయారవవచ్చు. కానీ ఆ జబ్బులు, ఆ అసహ్యం ఆత్మకు అంటుతాయా? అలాగే మురికివాడలో, . మురికి మనుష్యుల మధ్య వుంటూ కూడా యింటిలోపల ఎంత శుచి, శుభ్రత?

అప్పలస్వామి చెప్పింది అక్షరాలా నిజం. అతని కొడుకు డంబాచారి. మూర్ఖుడు. కూతురు విజ్ఞురాలు. వినయశీలి.

* * *

నెలరోజుల క్రితం ఆ రోజు – చివరిసారిగా అప్పలస్వామితో మాట్లాడేడు చైనులు.

“అప్పలస్వామీ. ఈ సారి నీవు కుట్టిన చెప్పులు నువ్వు పెట్టిన గడువు కాలం కన్నా యిబ్బడి కాలం మన్నేయోయ్. యిలాగవుతే నువ్వు బ్రతికినట్లే. యిదిగో అడ్వాన్సు. కొత్త చెప్పులు కుట్టివ్వు”

“చెప్పులు ఎక్కువగాలం మన్నటం నా గొప్పకాదు బాబూ. మీరు తిరగటం తగ్గింది. మీ కాళ్ళ పదును తగ్గింది”

ఎంత సైంటిఫిక్‌గా చెప్పేడు?

“పెద్దవాళ్ళమయిపోతున్నాం కదోయ్ మనం?”

యిద్దరి పరిచయ కాలాన్ని, అనుబంధాన్ని గుర్తుచేసుకొంటూ అన్నాడు చైనులు.

అప్పలస్వామి నవ్వేడు. ఆ నవ్వు వెనుక విషాదఛాయ కన్పించింది. ఉలిక్కిపడి చైనులు కారణం అడిగాడు.

“పెద్దతనం పైనబడ్తున్న సమయంలో ఎక్కొచ్చిన కొడుకు ప్రయోజకుడు కాకపోవటం కన్నా జీవితంలో విషాదం ఏముంది బాబూ?”


కూతురు చైనులు దగ్గర పూజాపునస్కారాలు నిముషంలో నేర్చుకుంది. ఆమెకు పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించాడు అప్పలస్వామి.

కాని కొడుకు?

అతని చదువు ఒక అనంతయాత్ర. మొదలూ తుదీ కన్పించటం లేదు. అతని ఆశలు ఆకాశంలో. ప్రతిభ పాతాళంలో.

“యిక్కడ వుంటే వాడింకా చెడిపోతాడని భయంగా వుంది. గ్రామంలో అవుతే స్వంత యిల్లయినా వుంది. యిక్కడ ఏముంది? కళ్ళు మూస్తే రోడ్డుపాలేకదా? గ్రామానికి వెళ్దామని ఆలోచిస్తున్నాను బాబూ. అందుకే కొత్త చెప్పులు కుట్టటానికి ఆర్డర్లు తీసుకోటం లేదు”

భయం



అప్పలస్వామి... అతని చెప్పులు... ఈ రెండూ కాని స్థితి ఊహించుకొంటే భయమేసింది. బాధ కలిగింది. కానీ చైనులు ఏం చెయ్యగలడు?

"యిన్నేళ్ళు నా చెప్పులకు అలవాటుపడ్డ మీరు మరో చెప్పులు తొడుక్కోలేరని నాకు తెల్సు బాబూ. కానీ అలవాటు చేసుకోండి"

"అప్పలస్వామీ. నిన్ను గురించి విని చెప్పులు తొడగటం అలవాటు చేసుకున్నాను. నేను, నువ్వు, ఈ చెప్పులు... అన్నీ అశాశ్వతం అని నాకు తెల్సు. మన మధ్య చెప్పుల ద్వారా పెరిగిన అనుబంధమే శాశ్వతం నీ నిర్ణయాన్ని నేను హర్షిస్తున్నాను. అలాగే కానియ్..."

చైనులు కదిలి వెళ్ళబోయాడు. నాలుగడుగులు వేసేడు కూడా.

"బాబూ..."

చైనులు వెనక్కితిరిగి చూచాడు. అప్పలస్వామి కళ్ళు తుడుచుకొంటున్నాడు.

"బాబుగారూ చెప్పులు కుట్టిస్తాను. కానీ వో చిన్న మాట. ఈ సారి కుట్టిచ్చే చెప్పులు మన అనుబంధానికి గుర్తుగా నా బహుమతి"

"నువ్వింత స్వార్థపరుడివనుకోలేదు అప్పలస్వామీ. నన్ను నీకు ఋణగ్రస్తుడిని చేసుకోవా లనుకొంటున్నావా? పిచ్చివాడా. మన అనుబంధానికి వస్తురూపమైన బహుమతులు అక్కర్లేదోయ్. శారీరక, మానసిక, స్థాయిలను దాటి ఆధ్యాత్మిక స్థాయికి చేరిన ఆ బంధం యొక్క స్థాయిని తగ్గించకు. యిదిగో అడ్వాన్సు. చెప్పులు ఎప్పుడిస్తావో చెప్పు"

"సరిగ్గా ఈ నాటికి పదిహేనోరోజు.."

పదిహేనోరోజు కాదు. వారంరోజులకే అప్పలస్వామి కన్పించటం మానేసేడు.

* * *

అన్నమాట తప్పేమనిషికాదు అప్పలస్వామి. అందునా అడ్వాన్సు కూడా పుచ్చుకున్నాడు. గడువురోజుకు అప్పలస్వామి కూర్చునే స్థానం వద్ద కెళ్ళాడు చైనులు.

ఖాళీ...

ఏమయింది అప్పలస్వామికి? చైనులు ఆందోళన చెందాడు.

రోజూ కాలేజీకి వెళ్తూ ఆశగా ఆ సెంటర్లో ఆ స్థానం వైపు చూడటం... నిరాశ చెందటం...

చుట్టుప్రక్కల షాపుల వాళ్ళను విచారించాడు. లాభంలేకపోగా ఇంటికి వెళ్ళాడు. యిల్లు ఖాళీ చేసి వాళ్ళవూరు వెళ్ళారని తెల్సింది.

"ఏం బాబూ? వాళ్ళు మీకూ్కడా ఏమైనా బాకీ వున్నారా? ఈ పేటలో వాళ్ళు బాకీలు లేనివాళ్ళు లేరనుకోండి. మీ డబ్బు మురిక్కాలవలో వేసినట్టే అనుకోండి" ఎవరో అన్నారు.

"ఎవరి సంగతి మీరు మాట్లాడుతున్నది?"

"యింకెవరి సంగతి? ఆ చెప్పులు కుట్టే ముసలోడి సంగతి — వాడి కొడుకు సంగతి. లుచ్చా వెధవలు... కంటబడ్తే రగతం కళ్ళ చూస్తాను నా కొడుకుల్ది"

బూతులు తిడ్తూనే వున్నాడు. వినలేక వచ్చేసేడు చైనులు.

అప్పలస్వామి నిజంగా అతనన్నట్లు మోసగాడా? ఛీ ఛీ...

'అప్పలస్వామి అలాంటివాడుకాదు. ఉన్నతుడు. ఎప్పటికైనా చెప్పులు తీసుకొని వస్తాడు'

అలా అనుకొంటూ వానలో తడిసి కాలేజీలో కాలుపెట్టేడు చైనులు.

"మీ కోసం ఎవరో వచ్చారు బాబూ. యిందాకట్నించి ఎదురు చూస్తున్నాడు..." ప్యూను చెప్పాడు.

అప్పలస్వామే! సందేహం లేదు.

"నమస్కారమండీ..."

వచ్చింది అప్పలస్వామి కాదు. అయినా నిరాశ చెందలేదు చైనులు.

* * *

అప్పలస్వామి కొడుకు చెప్పింది వినేసరికి చైనులు గుండె ద్రవించింది. గుండెల్లో నుంచి శోకం ఎగదన్నుకొని వచ్చింది.

అప్పలస్వామి చనిపోయాడా? తను ఆ మహోన్నతవ్యక్తిని మరి చూడలేడా?

"అయ్యా. మా నాన్న చివరి రెండురోజులు స్పృహలో లేడు. ఏవో పలవరింతలు నన్ను గురించి కాదు. నా తల్లి, చెల్లెళ్ళను గురించి కాదు. అసలు మనుష్యుల్ని గురించే కాదు. అవన్నీ నాలాంటి వాడికి అర్థంకాని విషయాలు వాటిని అర్థం చేసుకోగల స్థితికి నేను వచ్చేసరికి ఆయన కన్నుమూసాడు." అంటూ ఆ పలవరింతల సారాంశం చెప్పేడతను.

అవన్నీ మనిషిని వున్నతుడిని చేసే ఆదర్శాలు. సమాజాన్ని వున్నత స్థితికి తీసుకెళ్ళే మార్గాలు.

"కానీ సరిగ్గా చనిపోవటానికి కొన్ని నిముషాలు ముందు ఆయనకు స్పృహ వచ్చింది బాబూ. ఆ కొద్ది నిముషాలలో ఆయనకి గుర్తుకు వచ్చిందెవరో తెల్సాసార్? మీరు. మీ గొప్పతనాన్ని గురించి పొగుడ్తూనే వున్నాడు. మీ గద్దర తీసుకున్న అడ్వాన్సు విషయం చెప్పేడు. చెప్పులు కుట్టి యివ్వలేకపోయినందుకు క్షమించమన్నాడు. మీ డబ్బు మీకు యిమ్మన్నాడు. మా నాన్న ఆదేశించినట్లు మీ డబ్బు వెంటనే యివ్వలేను బాబూ. కానీ యిదిగో ప్రోనోటు—"

టేబిల్ మీద పెట్టిన ప్రోనోటును చూచి నవ్వేడు చైనులు. చించి ముక్కలు చేసేడు.

"తన వృత్తి పట్ల గౌరవం, ఆత్మవిశ్వాసం నిజాయతీ వున్న మీ నాన్నగారు బ్రహ్మజ్ఞాని. బ్రహ్మర్షి ఆయన. ఆయన ఋణాన్ని నువ్వు తీర్చగలవా బాబూ. దాన్ని తీర్చే మార్గం ఇదేనా?"

అర్థం కానట్లు చూచాడతను.

"మా నాన్నగారు ఆఖరి కోరిక వొకటి వుంది సార్. అది తీర్చటానికి యిప్పుడు మీ వద్దకొచ్చాను. ఆ కోరికలో మనిద్దరం భాగస్వాములం"

"కోరికా? మీనాన్నకు ? ఏమిటి?"

"ఎప్పటికైనా నేను బాగుపడదల్చుకొంటే మీ పాదాలను ఆశ్రయించమన్నాడు. అదే ఆయన ఆఖరి కోరిక"

చైనులు ఆ కోరిక విని ఆనందించాడు.

"నేను బాగుపడాలనుకొంటున్నానిప్పుడు. నా పొరపాట్లు తెల్సుకొన్నాను. అందుకే మా నాన్నకోరిక ప్రకారం మీ పాదాలను ఆశ్రయిస్తున్నాను" అతను లేచి ఆయన పాదాలను తాకేడు.

"చాలా సంతోషం బాబూ. మీ నాన్న నీ రూపంలో నా పాదాలకు బంగారు జోళ్ళు బహుమానంగా యిచ్చారన్నమాట! అయితే చెప్పు. నువ్వు యిప్పుడు ఏం చేద్దామనుకొంటున్నావ్?"

"యింతవరకు నా కులవృత్తిని అసహ్యించుకొని బానిస వృత్తిని చేపట్టాలని కలలుగన్నాను సార్. యిప్పుడు నా వృత్తిని ప్రేమిస్తాను. మా నాన్నకు వారసుడిని కావటానికి ప్రయత్నిస్తాను"

"గుడ్. కులవృత్తినే కాదు — నువ్వు చేపట్టిన వృత్తిని గౌరవించటం నేర్చుకో. మనిషి పాదాలకు చెప్పులు రక్ష. అలాగే సమాజ ఆరోగ్యానికి రక్ష — వ్యక్తి శీలం. నీ శీలమే వ్యక్తిగా నిన్ను వున్నతుడిని చేస్తుంది. నీ వృత్తిలో నీ శాశ్వత అభ్యున్నతికి తోడ్పడుతుందని గుర్తుంచుకో"

—అంటూ అతని భుజంపైన చెయ్యివేసి దగ్గరికి తీసుకున్నాడు చైనులు.

*

ప్రజాసేవ

